
## కాలి నడకన శబరిమలకు..

● 38 రోజులు..

**1148 కి.మీ. పాదయాత్ర**

సైదాబాద్, అక్టోబర్ 28 : శబరిమల అయ్యప్పస్వామి దర్శనం కోసం పాదయాత్రగా తరలి వెళ్తున్నామని గురుస్వాములు పవన్, రాజుదేశాయ్ తెలిపారు. వేణుగోపాల్ శిష్య బృందం కాలినడక ద్వారా శబరిమల యాత్రకు బయలు దేరుతున్నామని తెలిపారు. ఆదివారం ఉదయం బషీర్‌బాగ్‌లోని అమ్మవారి ఆలయంలో ఇరుముడి కట్టుకుని, సాముహికంగా కాలినడక ద్వారా శబరిమలకు పోతున్నామని తెలిపారు. తమ ఆధ్వర్యంలో అనేక ఏండ్లుగా కాలినడక ద్వారా వెళ్లి అయ్యప్పస్వామిని దర్శించుకుని వస్తున్నామన్నారు. పలు ప్రాంతాలకు చెందిన అయ్యప్పస్వాములు నగరం నుంచి పాదయాత్ర తరలివెళ్తున్నామని చెప్పారు. శబరిమల పాదయాత్ర రూపకర్త అయిన వేణుగోపాల్ గురుస్వామి సూచించిన మార్గంలో తామంతా అనేక ఏండ్లుగా పాదయాత్ర కొనసాగిస్తున్నామన్నారు. ఆయన స్మృతులతో పాదయాత్ర ద్వారా 38 రోజులపాటు 1148 కి.మీ.ను మూడు రాష్ట్రాల మీదుగా పాదయాత్ర చేసి శబరి గిరీశుడిని దర్శించుకుంటామని వారు తెలిపారు.

# బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం


హోంమంత్రి మహమూద్ అలీని సన్మానిస్తున్న జీహెచ్ఎంఈయూ అధ్యక్షుడు గోపాల్, నాయకులు

చాదర్‌ఘాట్, అక్టోబర్ 28 : బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత కల్పిస్తూ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి వైపు తీసుకెళ్లారని హోం మంత్రి అన్నారు. మరింత అభివృద్ధి సాధించాలంటే మళ్లీ బీఆర్ఎస్ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జీహెచ్ఎంఈయూ అధ్యక్షుడు ఊదరి గోపాల్ బీఆర్ఎస్‌లో చేరారు. ఈ నేపథ్యంలో శనివారం గోపాల్ అనుచరులతో కలిసి హోంమంత్రిని ఘనంగా సన్మానించారు. హోంమంత్రి మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీల మాటలను నమ్మవద్దని.. రాష్ట్రం శాంతి, సామరస్యం, గంగా జమునా తహజీబ్‌కు నిదర్శనమ న్నారు. అన్ని వర్గాలు, మతాల ప్రజలు సీఎం కేసీఆర్ పాలనలో సంతోషంగా ఉన్నారన్నారు. కరెంట్, నీళ్ల కష్టాలు లేకుండా రైతాంగం సంతోషంగా ఉన్నారన్నారు. కార్మికులు, ఉద్యోగుల కోసం పెద్దపీట వేసి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంఈయూ నాయకులు ఎంఏ.జబ్బార్, నర్సింగ్, శ్రీనివాస్, కిరణ్, జావెద్ పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి కృషి

చాదర్‌ఘాట్, అక్టోబర్ 28 : ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. శనివారం ఛావుని డివిజన్ పరిధిలోని జైకా హోటల్ లేన్, సుల్తాన్‌దేరా ప్రాంతాల్లో స్థానికులతో గ్రూప్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. డివిజన్ల వారీగా మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ప్రణాళికతో పనులు పూర్తి చేయించినట్లు తెలిపారు. మలక్‌పేటలో ఐటీ టవర్ తీసుకొచ్చిన ఘనత ఎంఐఎంకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎంఏ.సలాం షాహీద్, మాజీ కార్పొరేటర్ మినాజుద్దీన్, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.


గ్రూప్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల

## ఓటింగ్ యంత్రాలపై అవగాహన




ఎన్నికల నేపథ్యంలో మలక్‌పేట నియోజకవర్గంలోని 300 పోలింగ్ కేంద్రాల ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఈవీఎంలు, వీవీప్యాట్‌లపై శిక్షణ తరగతులను నిర్వహించారు. శనివారం మలక్‌పేట ముంతాజ్ ఇంజనీరింగ్ కాలేజీలో నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వెంకట ఉపేందర్ రెడ్డి, ఏఆర్వో జయంత్, ఈఆర్వో యుగంధర్ రెడ్డి పర్యవేక్షణలో బ్యాలెట్ బాక్స్ ఈవీఎం, వీవీప్యాట్‌లపై మాస్టర్ ట్రైనర్లు, టెక్నికల్ ఎక్స్‌పర్ట్‌లు అవగాహన కల్పించారు. రెండు రోజుల పాటు రెండు విడుతలుగా 1600 మందికి అవగాహన కల్పించారు. **- సైదాబాద్, అక్టోబర్ 28**

## భార్య గొంతు కోసి.. ఆపై ఆత్మహత్యాయత్నం

మాదన్నపేట, అక్టోబర్ 28 : భార్య గొంతు కోసి.. ఆపై భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఐఎస్ సదన్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. 8 నెలల క్రితం చంపాపేట రాజిరెడ్డి నగర్‌లో స్వప్న, హనుమంతు అన్నాచెల్లెలుగా ఇంటి యజమానికి పరిచయం చేసుకొని గది అద్దెకు తీసుకున్నారు. కాగా ..మూడు నెలల నుంచి అద్దె చెల్లిస్తూ స్వప్న ఒంటరిగా ఇంట్లోనే ఉండసాగింది. ఇంటికి తరచూ ఇద్దరు వ్యక్తులు వస్తుండటంతో యజమాని హెచ్చరించారు. దీంతో స్వప్న తనకు నెల క్రితం మహేశ్వరానికు చెందిన ప్రేమ్‌కుమార్‌లో వివాహం జరిగిందని చెప్పింది. కాగా శనివారం ఉదయం 11 గంటల సమయంలో ప్రేమ్‌కుమార్.. తన భార్య గొంతు కోసి తాను రెండు అంతస్తుల మేడ పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గాయాల పాలైన ప్రేమ్‌కుమార్‌ను దవాఖానకు తరలించారు. స్వప్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. హత్య జరిగిన సమయంలో ఇద్దరు వ్యక్తులు మెట్లు దిగి పారిపోయినట్లు యజమాని తెలిపారని పోలీసులు అన్నారు. మృతురాలు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# కిడ్నీ రోగులకు భరోసా ..

● మలక్‌పేట ఏరియా సర్కార్ దవాఖానలో సేవలు

● ఆరేండ్లలో 32,040 మందికి ఉచితంగా డయాలసిస్

సైదాబాద్, అక్టోబర్ 28 : మలక్‌పేట ప్రభుత్వ దవాఖానలోని డయాలసిస్ కేంద్రాల్లో సర్కారీ వైద్యం గ్రేట్ అనిపించుకుంటుంది. ప్రభుత్వం కిడ్నీ వ్యాధిగ్రస్తుల రోగుల కోసం ప్రత్యేక శ్రద్ధపెట్టి చర్యలు శ్రీకారం చుట్టింది. కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను చూసిన ప్రజలు దవాఖానలకు వస్తుండటంతో రోగుల సంఖ్య పెరిగింది. దేశంలో ఎక్కడాలేని విధంగా సింగిల్ యూజ్డ్ ఫిల్టర్ సిస్టమ్‌తో ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపుతుంది. ప్రభుత్వం పింఛన్, సింగిల్ యూజ్డ్ ఫిల్టర్ సిస్టమ్‌తో సేవలు అందిస్తుండటంతో బాధితులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

**మలక్‌పేట వాసులకు ..**

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పేద, మధ్య తరగతి రోగులకు ఉచిత డయాలసిస్ సేవలు అందిస్తూ మలక్‌పేట డయాలసిస్ కేంద్రం భరోసా కల్పిస్తుంది. మలక్‌పేట దవాఖాన కిడ్నీ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తే రోగుల మన్ననలు పొందుతుంది. మలక్‌పేట ఏరియా దవాఖానలో 2017 అక్టోబర్‌లో అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఏర్పాటుచేసిన సింగిల్ యూజ్డ్ ఫిల్టర్ సిస్టమ్ డయాలసిస్ సెంటర్ కిడ్నీ రోగులకు వరంగా మారింది.

**రికార్డు స్థాయిలో డయాలసిస్..**

2017లో 70 మందికి, 2018లో 3,707 మందికి, 2019లో 5,494 మందికి, 2020లో 6,833 మందికి, 2021లో 6,574 మందికి, 2022లో 1,558 మందికి, 2023 ఇప్పటి వరకు 7,794 మందికి సింగిల్ యూజ్డ్ ఫిల్టర్ సిస్టమ్‌తో డయాలసిస్ సేవలను అందించారు. 2017 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు 32,040 మందికి మలక్‌పేట సర్కార్ దవాఖానలో ఉచితంగా డయాలసిస్ సేవలను అందించటం జరిగింది. జర్మనీ కంపెనీ తయారుచేసిన డిమేడ్ టర్కీ టెక్నాలజీతో రూపొందించిన జపాన్ అడ్వాన్స్‌డ్ నెప్రో డయాలసిస్ యంత్రాలు ఇక్కడ ఉన్నాయి. పది మిషన్లు 24 గంటలు అందుబాటులో ఉండటంతో ఒకేసారి100 మందికి డయాలసిస్ చేసే వ్యవస్థ అందుబాటులో ఉన్నది. రోజుకు 36 మందికి తగ్గకుండా డయాలసిస్ చేస్తున్నారు. గతనెలలో రికార్డు స్థాయిలో 910 మందికి డయాలసిస్ చేసి చరిత్ర సృష్టించారు ఇక్కడి సిబ్బంది.

**కిడ్నీ రోగులకు మెరుగైన సేవలు..**



మలక్‌పేట ప్రాంత ప్రజలందరికీ సింగిల్ యూజ్డ్ ఫిల్టర్ సిస్టమ్ డయాలసిస్ సెంటర్ అందుబాటులో ఉండటంతో అనేక మంది కిడ్నీ రోగులు ఉచితంగా ఉపయోగించుకుంటున్నారు. అత్యాధునిక వైద్య సదుపాయాలతో కిడ్నీ రోగులకు మెరుగైన వైద్య సేవలను కార్పొరేట్ స్థాయిలో అందిస్తున్నాం. అధిక సంఖ్యలో రోగులకు సేవలను అందించి వారి ఆరోగ్య పరిరక్షణకు పాటుపడుతున్నాం. ఎక్కడా లేని విధంగా సర్కార్ దవాఖానలో అత్యాధునిక టెక్నాలజీ కలిగిన పది మిషన్ల ద్వారా రోగులకు డయాలసిస్ సేవలను అందిస్తుండటంతో వివిధ ప్రాంతాలనుంచి బాధితులు వస్తున్నారు. ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలను అందించటమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం.

**- డాక్టర్ త్రిలోక్ శ్యామ్,**
**మలక్‌పేట ఏరియా దవాఖాన సూపరింటెండెంట్**

**పింఛన్ పెంచుతే బాగుంటది..**



ప్రభుత్వం కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న రోగుల కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పిస్తుంది. ఉచితంగా సింగిల్ యూజ్డ్ ఫిల్టర్ సిస్టమ్‌తో డయాలసిస్ సేవలు అందిస్తుండటం సంతోషంగా ఉంది. ప్రైవేట్‌లో వైద్యం కోసం ఉన్న స్థిరాస్తులను అమ్ముకోవటమో, అప్పులు చేసి వైద్యం చేయించుకునే పరిస్థితుల నుంచి ప్రభుత్వం విముక్తి కల్పించింది. వైద్యులు, సిబ్బంది అందించే సేవలు మంచిగా ఉన్నాయి. మాలాంటి పేదోళ్ల ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న సర్కార్‌ను మేం మరిచిపోలేం. కిడ్నీ రోగులకు ప్రస్తుతం అందిస్తున్న పింఛన్ పెంచుతే బాగుటుందని, సీఎం కేసీఆర్ సార్‌ను కోరుతున్నా.

**- జెల్లిపోతుల మాధురి, నాగోల్**


మలక్‌పేట ఏరియా దవాఖానలో డయాలసిస్ కేంద్రం

**పైసా ఖర్చులేకుండా డయాలసిస్ ..**



రెండేళ్లుగా పైసా ఖర్చులేకుండా డయాలసిస్ చేయించుకుంటున్నా. ప్రైవేట్ దవాఖానల్లో చేయించుకుంటే వేలాది రూపాయలు ఖర్చు అవుతుండే. ఇప్పుడు బాధ తప్పింది. సీఎం కేసీఆర్ సార్ మంచిగా చేసుండ్రు. మాలాంటి పేదోళ్లకు వచ్చిన రోగానికి డబ్బులు లేక చాల ఇబ్బందులు పడుతున్నాం. సర్కారీ దవాఖానలో డయాలసిస్ ఉచితంగా చేస్తుండటంతో ఆ బాధలను తప్పినాయి. ప్రైవేట్ దవాఖానలో కంటే ఇక్కడే చాలా మంచిగా చేస్తుండటంతో ఇక్కడి వచ్చి చేయించుకుంటున్నాను. సీఎం కేసీఆర్ సార్ పైసా ఖర్చులేకుండా ప్రభుత్వం ఉచితంగా డయాలసిస్ సేవలను అందిస్తుండటంతో పేద వారికి ప్రభుత్వం అండగా ఉందనిపిస్తుంది.

**- సోనగంటి వెంకట్ చారి, తుర్కయంజాల్**

